క్లుప్తంగా

ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో ముగిసిన సదస్సు

తెనాలి అర్బన్: అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. నాగరాజు, అమెరికాలోని ఇలినాయిస్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి తదితరులు ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. సుమారు 700 మంది ఫార్మసీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నట్లు ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

చెత్త సేకరణలో జాగ్రత్త అవసరం

తెనాలి అర్బన్: చెత్త సేకరణలో కార్మికులంతా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె. హెలెన్ నిర్మల సూచించారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రజక పార్కులో దోమల నియంత్రణపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం చినరావూరులోని కమ్యూనిటీ హాల్‌లో కార్మికులకు వృత్తిపరమైన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులంతా మాస్కులు, షూస్, గ్లౌజులు ధరించాలని, దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు దరిచేరవని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, సెక్రెటరీలు ఎస్. ప్రవీణ్ కుమార్, డి. సాగరయ్య, జి. చంద్రశేఖర్, ఎ. ఉమామహేశ్వరరావు, టి. శ్రీనివాస్, కె. నాగరాజు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని తండ్రీ, కుమార్తెలకు తీవ్ర గాయాలు

తెనాలి రూరల్: లారీ ఢీకొని తండ్రి, కుమార్తె తీవ్రంగా గాయపడిన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం కఠెవరానికి చెందిన ప్రియ తెనాలిలోని ప్రైవేటు బ్యాంకులో శిక్షణ పొందుతోంది. తండ్రీ నారాయణరావుతో కలసి బుధవారం యాక్సెస్ స్కూటర్‌పై తెనాలి వస్తుండగా సాయిబాబా గుడి సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. వీరి వాహనం లారీ కింద ఇరుక్కు పోయి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. తండ్రీ, కుమార్తెలకు త్రుటిలో ప్రాణాపాయం తప్పి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే ఇద్దరినీ ప్రైవేటు వైద్యశాలకు పంపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గిరిజన నాయకుడు ముత్తయ్య సంస్మరణ సభ

తెనాలి అర్బన్: రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంఘం నాయకుడు గరిక ముత్తయ్య సంస్మరణ సభ గురువారం దుగ్గిరాలలో జరుగుతుందని నిర్వాహకుడు గరిక వెంకట దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ కుమార్, వివిధ సంఘాల నాయకులు గుంటి సురేష్‌బాబు, కనపర్తి అబ్రహాం లింకన్, మాదగాని గుర్నాథం, కుంభా రాంబాబు, జీఎస్ నాగేశ్వరరావు, దానబోయిన సంతోష రూపవాణి తదితరులు వెల్లడించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

భట్టిప్రోలు: మండల పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ బుధవారం హెచ్చరించారు. ఎక్కడైనా పేకాట, కోడి పందేలు, నంబర్లాట తదితర ఆటలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఉపాధికి పీఎం విశ్వకర్మ పథకం ప్రాథమిక లక్ష్యం

భట్టిప్రోలు: ఉపాధి మార్గాలను సృష్టించడమే ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ప్రాథమిక లక్ష్యమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలులోని మండల పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకానికి ఏపీ వడ్రంగి అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరరావు కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేయించుకున్న ధ్రువీకరణ పత్రాన్ని బుధవారం ఎంపీపీ లలిత కుమారి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జలజ, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

భట్టిప్రోలు: ప్రకృతి వ్యవసాయంపై బుధవారం రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరిలో నాము తెగులు, రసం పీల్చే పురుగులను గుర్తించారు. నివారణకు పేడ మూత్రం, ఇంగువ ద్రావణం, దశపర్ణి కషాయం పిచికారీ చేయడం ద్వారా అరికట్టవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల నుంచి జిల్లా స్థాయి మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ అధికారి(డీఎల్‌పీఎం) మోహన్, సూరేపల్లి, ఐలవరం యూనిట్లకు చెందిన క్యాడర్ల ఏటీఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటీలు బాలా, పాప, డి.ఝాన్సీరాణి, సురేష్, పండు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పాలన

- ఎమ్మెల్యే శివకుమార్
- కొలకలూరులో 11వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం



కోనేపురంలో మట్టి పాత్రలు తయారు చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 11వ రోజు నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోనేటిపురంలో కుండలు తయారు చేసే కార్మికుల్ని కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి కొద్దిసేపు కుండలు తయారు చేశారు. కుండలు కాల్చే సమయంలో ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు, రెండు సచివాలయాల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని అనమర్లపూడి డొంకను సిమెంటు రోడ్డుగా వేశామని, ప్రజల సమస్యలు పరిష్కరించామని తెలిపారు. పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు చక్కా సీతమ్మ, కె.ఫణికుమార్, నాగదేవిక, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, పార్టీ నాయకులు ఎం.బుల్లియ్య, విజయకుమార్, కొలకలూరు నాగేశ్వరరావు, రావూరి రవిబాబు, పినపాటి అనిల్, ప్రసాదం సురేష్, జి.శ్రీనివాసరావు, పి.సుబ్బారావు, ప్రసాదం రాధారావు, ఉన్నం రాజేంద్ర, నాగం నాగేంద్రం, జోసఫ్, పంచాయతీ కార్యదర్శి కె.రామసుబ్బారావు, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, వీఆర్వోలు సురేష్, నితీష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉండ్రాలయ్యా.. నీకు దండాలయ్యా...

- గణనాథుడి విగ్రహాల వద్ద విశేష పూజలు
- పలుచోట్ల నిమజ్జనాలు



చెంచుపేటలో వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



37వ వార్డులో వినాయకునికి పూజలు చేస్తున్న కౌన్సిలర్ రాము, వైఎస్సార్ సీపీ నాయకులు



నాజర్‌పేటలో అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



కొలకలూరులో లడ్డూను వేలం పాటదారుడికి అందిస్తున్న ఎమ్మెల్యే, ఆయన కుమారుడు

తెనాలి టౌన్ : పట్టణంతో పాటు, రూరల్ గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల వద్ద భక్తులు విశేషంగా పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ట్రాక్టర్లపై సమీపంలో ఉన్న కాలువల్లో నిమజ్జనం చేశారు. చెంచుపేటలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మహిళలు వరసిద్ధి వినాయక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని కన్వీనర్ రాజు పర్యవేక్షించారు.

■ కొలకలూరు సమీపంలో బ్రిక్స్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆయన కుమారుడు సత్యనారాయణ పూజలు నిర్వహించారు. స్వామి ప్రసాదం లడ్డూను తెనాలికి చెందిన పఠాన్ సుభాన్‌ఖాన్ రూ. 15వేలకు పాడుకున్నారు.

■ నాజర్‌పేటలో వేణు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పూజల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు టి.రమేష్, ఎ.శ్రీనివాసరావు, అర్తిమల్లు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

■ 37వ వార్డులో కౌన్సిలర్ మల్లిబోయిన రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వెంకటేశ్వరరావు, రమణ, మల్లిబోయిన బాజి, శ్రీమన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.

■ గుడివాడలో వినాయకుని విగ్రహం వద్ద ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

■ రూరల్ మండలం కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో గణపతి విగ్రహాలను ఊరేగింపుగా కొమ్మమూరు, తూర్పు కాలువల్లో నిమజ్జనం చేశారు.

భక్తుడి జేబుకు పానకం ఘాటు

పానకాల స్వామి అంటే తెలుగురాష్ట్రాల్లో చాలామందికి ఇలవేల్పు. ఆయన సన్నిధికి వచ్చి దర్శనం చేసుకుని ఆయనకు ఇష్టమైన పానకాన్ని నివేదించి వెళ్లడం అందరికీ ఆనవాయితీ. అయితే వీరు కొండకు వచ్చి తిరిగి వెళ్లే లోపల జేబులు ఖాళీ అయిపోతున్నాయి. పూజాద్రవ్యాలు నుంచి పానకం టికెట్లుకొనే వరకు భక్తులు దోపిడీకి గురవుతున్నారు. అడిగే వాడు లేకపోవడం.. పట్టించుకునే వాడు కానరాకపోవడమే.. ఇక్కడి వ్యాపారులకు, కాంట్రాక్టర్‌కు జేబులు నింపుతోంది.

- పానకాల స్వామి కొండపై భక్తులను దోచుకుంటున్న కాంట్రాక్టర్
- అధిక ధరలకు పానకంతో పాటు పూజా సామగ్రి అమ్మకాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- భక్తులకు మిగులుతోన్న ఆవేదన



20 రూపాయలు బాటిల్స్ మాత్రమే విక్రయిస్తున్న వైనం



బాటిల్స్, పూజా సామగ్రి విక్రయిస్తున్న పూజారి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఎగువ సన్నిధిలో భక్తులు దోపిడీకి గురవుతున్నారనే ఆరోపణలున్నాయి. పానకం, పూజా సామగ్రి విక్రయాలు జరిపేందుకు ప్రతి ఏటా బహిరంగవేలం నిర్వహిస్తారు. అయితే గత 30 సంవత్సరాలుగా సంస్థలు మారినా కాంట్రాక్టర్ మాత్రం ఒక్కరే ఉండి దాన్ని దక్కించుకుంటుండడం విశేషం. 30 సంవత్సరాల కిందట వేలల్లో ప్రారంభమై పానకం, పూజాసామగ్రి విక్రయ వేలం పాట నేడు రూ. 1.60 కోట్లకు చేరుకుంది. ఇది పాడుకుని నిర్వహిస్తోంది మాత్రం ఒక్క కాంట్రాక్టర్. బహిరంగ వేలంలో మరి కొందరు పాల్గొని పాట పాడుకున్నా వ్యాపారం చేసే సమయంలో అడ్డంకులు సృష్టిస్తుండడం పరిపాటిగా మారింది. అధికారులు సైతం ఆ కాంట్రాక్టర్‌కే వత్తాసు పలుకుతుండడంతో మరలా వ్యాపారాన్ని అతడికే అప్పగించి వెళ్లిన ఘటనలున్నాయి. రెండు లీటర్ల పానకం రూ. 60 అమ్మాల్సి ఉండగా తులసిమాల, పటిక బెల్లంతో కలిపి రూ.100కి విక్రయిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను తులసిమాల, పటిక బెల్లం తీసుకోకపోతే పానకం టిక్కెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇక పూజా సామగ్రి, కొబ్బరి కాయలు నిబంధనలలో ఉన్న ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిరంతరం పర్యవేక్షించి దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఇదేమిటి ప్రహ్లాద!!

ఎగువ సన్నిధిలోని శ్రీ పానకాల లక్ష్మీనృసింహ స్వామి వారి పానకం వేలం పాటతో విజయవాడకు చెందిన శ్రీ ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు ఆటలాడుకుంటున్నారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఏడాది నిర్వహించే స్వామి వారి పానకం, పూజా సామగ్రి వేలంలో పాల్గొనే వారు పాట అయిన వెంటనే పాడుకున్న వారు తప్పనిసరిగా పూర్తి నగదు చెల్లించాలనే నిబంధన ఉంది. అయితే, గత ఏడాది దీనికి విరుద్ధంగా విజయవాడ ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు పాటపాడగా వారికి గడువు ఇచ్చారు. అది తీరినా పూర్తిగా నగదు చెల్లించకపోవడంతో మళ్లీ పాటపెట్టాల్సి వచ్చింది. ఈ ఏడాది బుధవారం జరిగిన పాటలో పాల్గొన్న ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా పాట పాడారు. అయితే, నగదు చెల్లించకపోవడం విశేషం. నిబంధనలు స్పష్టంగా చెప్పినా పాట పాడి నగదు తర్వాత చెల్లిస్తామని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు రద్దు చేసి వాయిదా వేశారు. ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారి తీరుపై అధికారులతో పాటు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడా ఉండవు ఈ ధరలు!



పానకం టిక్కెట్ ఒక్కటే అడిగితే ఇవ్వడం లేదు. తులసిమాల, పటిక బెల్లం తప్పనిసరి అని రూ.100 తీసుకున్నారు. ఎక్కడా లేని విధంగా కొబ్బరికాయ రూ.40 తీసుకున్నారు. అన్ని ఆలయాలకంటే అధిక ధరలు ఇక్కడ ఉండటం మాకు ఆశ్చర్యం కలిగించింది.

– నాగరాజు ధర్మవరం భక్తుడు

తప్పనిసరై కొన్నా!



పానకం టిక్కెట్ తీసుకోవాలంటే మేం వద్దన్నా తులసిమాల, పటికబెల్లం ప్యాకెట్ ఇచ్చి రూ.100 తీసుకున్నారు. కొబ్బరికాయలతో వత్తులు అన్ని అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎవరికి చెప్పాలో తెలియక తప్పనిసరిగా వారు చెప్పిన ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

– చౌదప్పు ధర్మవరం, భక్తుడు

చర్యలు తీసుకుంటాం

ఎగువ సన్నిధిలో పానకం, పూజా ద్రవ్యాలు అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం ఇంత వరకు నా దృష్టికి రాలేదు. నిరంతరం పర్యవేక్షిస్తున్నా. ఒకవేళ అధిక ధరలకు విక్రయించినట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత కాంట్రాక్టర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ఎ.రామకోటి రెడ్డి, దేవస్థాన ఈఓ, మంగళగిరి

యువకుడి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ పరిధిలో రైల్వేస్టేషన్ శివారులో ఓ యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. యర్రబాలేనికి చెందిన నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు మంత్రి వంశీ (24) అమ్మమ్మ నాగేశ్వరమ్మ దగ్గర ఉంటున్నాడు. తండ్రి మంత్రి నాగేశ్వరరావు వంశీ చిన్నతనంలోనే ఇంట్లోంచి వెళ్లిపోయాడు. తల్లి శ్రీలక్ష్మి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అమ్మమ్మతో కలసి ఉంటున్నాడు. 10వ తరగతి చదువుకున్న వంశీ విజయవాడలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ అమ్మమ్మను చూసుకుంటూ ఈ మధ్యకాలంలో ఇంటిని కూడా కొనుగోలు చేశాడు. ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లోంచి వెళ్లిపోయాడని అమ్మమ్మ నాగేశ్వరమ్మ తెలియజేసింది. ఉదయం వంశీ స్నేహితులకు తను ఉన్న ప్రాంతాన్ని తన సెల్‌ఫోన్ ద్వారా లోకేషన్ షేర్ చేసి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు లోకేషన్ ఆధారంగా సంఘటనా స్థలానికివచ్చి పరిశీలించగా అప్పటికే వంశీ మృతి చెంది కనిపించాడు. తెనాలి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి రైల్వే ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

25 నుంచి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. బుధవారం భట్టిప్రోలు ఏఐటీయూసీ కార్యాలయంలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్లలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రారంభం సందర్భంగా కూలిదండు మహా ప్రదర్శన, అనంతరం రథంసెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెల్లి విల్సన్, ఆవుల శేఖర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజి, నాయకులు వి.శ్రీనివాసరావు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ప్రేక్షకుల హృదయాల్లో ఏఎన్ఆర్ స్థానం పదిలం



ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాయి, సురేష్ తదితరులు.

తెనాలి అర్బన్: ఏడు దశాబ్దాలకు పైగా తన నటన ద్వారా తెలుగు వారి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని స్వరలయ వేదిక వ్యవస్థాపకులు లక్కరాజు సాయి కొనియాడారు. నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని శత జయంతి సభను స్వరలయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం మారీసుపేటలో నిర్వహించారు. ముందుగా ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ అక్కినేని 1946లో నటించిన బాలరాజు ఆయనకు ఎంతో కీర్తిని తెచ్చిపెట్టిందని గుర్తు చేశారు. 250కు పైగా చిత్రాలలో నటించిన అక్కినేని నటులకు ఎంతో ఆదర్శమని చెప్పారు. అనంతరం సీనియర్ రంగస్థల నటుడు కావూరి సత్యనారాయణకు అక్కినేని శత జయంతి పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. సమావేశంలో పినపాటి సురేష్, శ్రీధర్, వెంగళరావు, హేమంత్, మల్లేశ్వరరావు, వెంకీ, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెనాలి నుంచి ఢిల్లీ వెళ్లిన బీసీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న బీసీ సంఘు నాయకులు

తెనాలి అర్బన్: బీసీలకు 56శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు చలో బీసీ...చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ నవ చైతన్య సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకుడు మేడిబోయిన గంగా యాదవ్ పేర్కొన్నారు. మార్కెట్ లోని సంఘ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మల్లంపల్లి భీష్మ పాములు, మేకల శ్రీను, నల్లగొర్ల గంగాదేవి, ఆరాధ్యుల శివ, అశోక్, పి. యలమంద, వెంకటేశ్వరరావు, ఎస్. వెంకయ్య పాల్గొన్నారు.

విపత్తుల కార్యనిర్వహణ పరిశీలన



పంకజ్ కుమార్ మీనాకు వివరిస్తున్న డాక్టర్ అలీ, అంబేద్కర్

తాడేపల్లి రూరల్: స్థానిక ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని బుధవారం ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి పంకజ్ కుమార్ మీనా సందర్శించారు. ఈ సందర్భంగా విపత్తుల సంస్థ అవలంబిస్తున్న సాంకేతికతను గురించి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పంకజ్ కుమార్‌కు వివరించారు. తుపాన్లు, వరదలు, వడగాల్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి పంపించే కార్యాచరణను వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాలలోని వివిధ అంశాలను, కామన్ అలెర్ట్ ప్రోటోకాల్, ఏపీ అలెర్ట్ ద్వారా ప్రజలకు హెచ్చరిక మెసేజ్ పంపించే విధానాలను, కమ్యూనికేషన్ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్, వాకీ టాకీ, వీశాట్ కమ్యూనికేషన్ పరికరాల పనితీరును విపత్తుల సంస్థ ఈడీ డాక్టర్ సి. నాగరాజు, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ఎం. అలీలు పంకజ్ కుమార్‌కు వివరించారు.

సాధన మండలిలో రుషి పంచమి వేడుకలు

భట్టిప్రోలు: భద్రపద శుద్ధ పంచమినాడు మహా రుషులను గౌరవించి, పూజించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ గుంటూరు, కృష్ణా జిల్లాల అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు(వాసు)పేర్కొన్నారు. భట్టిప్రోలు సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమంలో బుధవారం రుషి పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్తలు ఏడుగురిని సప్త రుషులుగా భావించి భక్తి చైతన్య స్వామీజీ (విజయవాడ), భాస్కర స్వామీజీ(కపిలేశ్వరం), జానపాటి లీలావేణుగోపాల శర్మ(ధూళిపూడి), రామిశెట్టి నరసింహారావు(బాపట్ల), మునివర యోగి(విజయవాడ), పేరి శాస్త్రి(నరసరావుపేట), వేమినేని వెంటేశ్వరరావు (అద్దంకి పాలెం)లను పూజించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి ప్రధాన కార్యదర్శి కోట యశోద దేవి, నిర్వాహకులు పులికొండ దేవసేన ఆండాళ్, మాటూరు గృహలక్ష్మి, ఆత్మూరి సునీత, చుండూరు బాబు, బండి వెంకట్రావు, జవ్వాది శంకరరావు, తూనుగుంట్ల ఈశ్వరుడు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెదలంక(భట్టిప్రోలు): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పెదలంక మధ్యగూడేనికి చెందిన దున్నా కిరణ్ కుమార్(35) గృహ నిర్మాణ పనులు చేస్తుంటాడు. ఇంటికి ఆనుకుని మరో గదిని నిర్మిస్తుండగా స్లాబ్ సెంట్రింగ్ చెక్కలు ఊడదీసే క్రమంలో అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే వైద్యశాలకు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ పరిశీలించారు. మృతుడు భార్య దున్నా అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



మాట్లాడుతున్న ఈదులమూడి డేవిడ్‌రాజు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ సచివాలయంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికీ వైద్యం అందించి సేవలు చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యమిత్ర, ఏఎన్ఎంలతో ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబం వివరాలు తీసుకుంటారని తెలిపారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అనే విషయం తెలుసుకుని మెరుగైన వైద్యం అందించే విధంగా ప్రయత్నం చేయడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సింహాద్రి గోపి, వేముల లక్ష్మీ రోజా, ముదిగొండ ప్రకాష్, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ లలిత కుమారి, కమిటీ సభ్యులు

భట్టిప్రోలు: వైద్య ఆరోగ్య సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ(హెచ్‌డీఎస్) చైర్మన్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని కోరారు. వైద్యశాలలో రక్తపరీక్షల నిర్వహణ, పీహెచ్‌సీని సూచించే బోర్డు, అభివృద్ధి కమిటీకి సంబంధించిన బోర్డు విధిగా ఉండాలని కోరారు. భట్టిప్రోలు–1 ఉపకేంద్రం శిథిలావస్థలో ఉందని, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పద్మజ, సభ్యులు డి.వెంకటేశ్వరరావు(తహసీల్దార్), గుమ్మా చంద్రశేఖరరావు(ఎంపీడీఓ), దారా రవి కిరణ్మయి(సర్పంచి), టి.ఉదయ భాస్కరి(జెడ్పీటీసీ సభ్యురాలు), మోర్ల విజయలక్ష్మి(సర్పంచి, సూరేపల్లి) పాల్గొన్నారు.